క్లుప్తంగా

26న ఉచిత కంటి వైద్యశిబిరం

పుంగనూరు: పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 26న ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ ప్రతినిధి మునస్వామిమొదలియార్ తెలిపారు. చెన్నైకు చెందిన శంకర్ నేత్రాలయం వారిచే ఉచిత కంటి వైద్యశిబిరం విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కంటి జబ్బులు కలిగిన వారు శిబిరంలో పాల్గొని ఉచిత వైద్యసేవలు పొందాలని కోరారు.

రక్తదానం



శిబిరంలో ప్రిన్సిపల్, వైద్యులు

పుంగనూరు: పట్టణంలోని శుభరాం డిగ్రీ కళాశాల, రోటరీక్లబ్ సంయుక్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో 52 మంది యువకులు రక్తదానం చేశారు. గురువారం పట్టణంలోని శుభరాం డిగ్రీ కళాశాలలో శిబిరాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్, రోటరీ ప్రతినిదులు, డాక్టర్లు ప్రభాకర్, విజయకుమారి, డాక్టర్ శరత్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. యువకులు అధిక సంఖ్యలో హాజరై రక్తదానం చేశారు. సేకరించిన రక్తాన్ని బ్లడ్‌బ్యాంక్‌కు తరలించి, ఆపదలో ఉన్న వారికి ఉచితంగా అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మానవత సంస్థ చైర్మన్ డాక్టర్ నందీశ్వరయ్య, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సోమరాజు, క్లబ్ ప్రతినిదులు హరిప్రసాద్ పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలపై నివేదిక

పుంగనూరు: వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలపై నివేదికలు సిద్ధం చేసి జిల్లా అధికారులకు పంపనున్నట్లు ఏడీ శివకుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ వ్యవసాయశాఖ పరిధిలో మొత్తం 59 మంది రైతులకు చెందిన 29 హెక్టార్లలో పంట దెబ్బతిన్నట్లు ఆయన తెలిపారు. రొంపిచెర్లలో 8, పులిచెర్లలో 9, సదుంలో 12, సోమలలో 5, చౌడేపల్లెలో ఒక హెక్టార్‌లో పంట దెబ్బతినిందన్నారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించి, నివేదికలు సిద్ధం చేశామని పేర్కొన్నారు.

పలమనేరుకు కొత్తగా ఏడు బస్సులు



డిపోలో కొత్త బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు: స్థానిక ఆర్టీసీ డిపోకు కొత్తగా ఏడు బస్సులు మంజూరు కాగా వాటి ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం స్థానిక డిపోలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలమనేరు డిపోకు పూర్వవైభవాన్ని తీసుకొచ్చేలా కొత్త బస్సులను తెప్పించామన్నారు. స్థానిక డిపోకు కొత్త బస్సులను తెప్పించినందుకు పలమనేరు పరిరక్షణ సమితి నిర్వాహకులు ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో డీఎం టీకే స్వామి, స్థానిక టీడీపీ నాయకులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.3.75 లక్షలు స్వాహా

పలమనేరు: బాలికకు మాయమాటలు చెప్పి రూ.3.75 లక్షలు కొట్టేసిన సంఘటన గురువారం పలమనేరు మండలంలో వెలుగుచూసింది. మండలంలోని సంబార్‌పూర్‌కు చెందిన మహాలక్ష్మి కుమార్తె జయశ్రీ 9వ తరగతి చదువుతోంది. ఆమె తాత మరో ఇంట్లో ఉంటున్నాడు. అతను ఇంట్లోని వారిని ఎవరినీ నమ్మకుండా మనవరాలి ద్వారా కొంత డబ్బు దాచుకున్నాడు. ఈ విషయాన్ని గమనించిన బాలిక ఆ గ్రామంలోని లక్ష్మమ్మ దుకాణానికి వెళ్లినప్పుడు చెప్పింది. దుకాణం నిర్వాహకులు బాలికకు తినుబండారాలు ఇస్తూ మచ్చిక చేసుకున్నారు. ఈ నేపథ్యంలో తాత డబ్బును లెక్కించమని చెప్పినప్పుడల్లా బాలిక కొంత నగదు చోరీ చేసి దుకాణంలోని లక్ష్మమ్మ, వారి కొడుకులు గంగాధర్, గణేష్‌కు ఇచ్చేది. ఇలా గత ఏడాది డిసెంబరు నుంచి ఇప్పటి వరకు రూ.3.75 లక్షలు ఇచ్చింది. దీనిపై బాలిక అక్కకు అనుమానం వచ్చి తాత వద్దనున్న నగదును లెక్కించి చాలా తక్కువగా ఉండడాన్ని గుర్తించి తల్లికి చెప్పింది. వారు నిలదీయడంతో బాలిక అసలు విషయం చెప్పింది. తమ బిడ్డకు మాయమాటలు చెప్పి డబ్బులు కొట్టేసిన దుకాణానికి చెందిన లక్ష్మమ్మ కుటుంబంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

- నీటితో కళకళలాడుతున్న ప్రాజెక్టులు
- వంతెనల నిర్మాణంతో రాకపోకలు సులువు
- గత ప్రభుత్వ ముందుచూపుతో తీరిన కష్టాలు

తాగు నీటికి లేదిక చింత



నిండిన కొర్లకుంటవారిపల్లె ప్రాజెక్టు

సదుం: ప్రజల కష్టాలను పాలకులు గుర్తిస్తే ఎలా ఉంటుందో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆచరణలో చేసి చూపించింది. దీంతో ఆ ఫలితాల ఫలాలను నేడు అందరూ అనుభవిస్తున్నారు. పాలకులకు ముందుచూపు ఉంటే కష్టాలు ఎలా దూరమవుతాయో మండలంలో చేపట్టిన సాగు, తాగునీటి అభివృద్ధి పనులే ఇందుకు సాక్షాత్కారంగా నిలుస్తున్నాయి. మండలంలో కొన్నేళ్ల కిందట తాగు, సాగు నీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రజల కష్టాలను గుర్తించిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గత ప్రభుత్వంలోనే ప్రాజెక్టుల నిర్మాణానికి పూనుకున్నారు. గార్గేయ నదిలో వృథాగా పోతున్న నీటిని నిల్వ చేస్తే సమస్యలు తీరుతాయని భావించారు. ఈక్రమంలో పాపిరెడ్డిగారిపల్లె, కొర్లకుంటవారిపల్లెలో జలాశయాలు నిర్మించారు. వర్షాకాలంలో వరద నీటితో ఆ ప్రాజెక్టులు కళకళలాడుతున్నాయి. దీంతో తాగు, సాగునీటికి చింతే లేకుండా పోయింది.

నిండుకుండలా జలాశయాలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కంభంవారిపల్లె, ఊటుపల్లె, మొరవపల్లె పంచాయతీల పరిధిలో మరో మూడు మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులను నిర్మించారు. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో ఇప్పటికే కొర్లకుంట వారిపల్లె ప్రాజెక్టు నిండి మొరవ పోతోంది. మొరవ నీరు గార్గేయనది ద్వారా పాపిరెడ్డిగారిపల్లె ప్రాజెక్టుకు చేరి అది కూడా నిండి మొరవపోతోంది.



కలికిరి మార్గంలోని వంతెన

రాకపోకలకు తీరిన ఇబ్బందులు

గతంలో వర్షాకాలం వచ్చిందంటే గార్గేయనది వరద నీటితో పుంగనూరు, కలికిరి, పీలేరు మార్గాలలో రాకపోకలు నిలిచిపోయేవి. రోజుల తరబడి ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడేవారు. వరద ఉధృతి తగ్గితే తప్ప ప్రయాణం సాగించలేని పరిస్థితి ఉండేది. దీంతో గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే జాంద్రపేట, మఠం మిట్ట, కంభంవారిపల్లె క్రాస్, పాపిరెడ్డిగారిపల్లె క్రాస్ వద్ద వంతెనలు నిర్మించారు. ప్రస్తుతం గార్గేయనది సాగుతున్నా రాకపోకలకు ఇబ్బంది లేకుండా పోయింది. సాగునీటి కష్టాలు, వంతెనలు లేక గతంలో పడిన కష్టాలను పలువురు నేడు గుర్తు చేసుకొని గత ప్రభుత్వం చేపట్టిన మంచి పనులు కొనియాడుతున్నారు.

సాఫీగా ప్రయాణం



గతంలో మఠం మిట్టవద్ద తక్కువ ఎత్తులో కల్వర్టు ఉండడంతో గార్గేయనదిలో ప్రవాహం వచ్చిందంటే రాకపోకలకు ఇబ్బందులు కలిగేవి. మండల కేంద్రానికి చేరుకోవాలంటే రెండు కిలోమీటర్లకు పైగా చుట్టూ తిరిగి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఆకష్టాలు తొలగిపోయాయి. ఆ ప్రాంతంలో వంతెన నిర్మించడంతో ఎంత వరద నీరు వచ్చినా రాకపోకలు నిలిచే పరిస్థితి లేకుండా పోయింది.

–నాగరాజు, రెడ్డివారిపల్లి, సదుం

బోర్లలో సమృద్ధిగా నీరు



కొర్లకుంట వారిపల్లె ప్రాజెక్టు నిర్మించినప్పటి నుంచి వరుసగా పదిసార్లు ప్రాజెక్టు నిండింది. చుట్టు పక్కల ప్రాంతాలకు సాగు, తాగు నీటి కష్టాలు తప్పాయి. వ్యవసాయ బోర్లలో నీటిమట్టం పెరిగి..వ్యవసాయానికి ఇబ్బందులు లేకుండాపోయాయి.

–వాసు, తిమ్మానాయనపల్లి, సదుం

30న మండల మీట్

చౌడేపల్లె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 30వ తేదీ బుధవారం ఉదయం 10.30 గంటలకు మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ లీలామాధవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, ఆయా శాఖలకు చెందిన అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

26న మండల సమావేశం

పుంగనూరు: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 26న ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ లీలామాధవి పేర్కొన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. సాధారణ సమావేశాన్ని ఎంపీపీ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు , అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

బట్టందొడ్డిలో ఫ్యామిలీ డాక్టర్



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మురళి

పెద్దపంజాణి: మండలంలోని బట్టందొడ్డి గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. పెద్దపంజాణి ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి టి.మురళి రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం పంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి వైద్యసేవలు అందించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని గ్రామస్తులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ అరుణకుమారి, ఏఎన్‌ఎం వసంతకుమారి, ఆశావర్కర్‌లు నారాయణమ్మ, వసుంధర, శ్రావణి పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ

పెద్దపంజాణి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ బాలాజి గురువారం పంచాయతీ కార్యదర్శులతో పలు అభివృద్ధి పనులపై సమావేశం నిర్వహించారు. ఇందులోభాగంగా పంచాయతీ కార్యదర్శులు నిరంతరం గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించాలని సూచించారు. అదేవిధంగా ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచేందుకు సంబంధిత సిబ్బంది కృషిచేయాలని చెప్పారు. గృహ నిర్మాణ లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులో ఏలాంటి అలసత్వం లేకుండా ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. చలమంగళం, పెద్దపంజాణి, అమ్మరాజుపల్లి స్పెషల్ ఆధార్ కేంద్రాల్లో ఇప్పటి వరకూ 128 మందికి ఆధార్ అప్‌డేట్ చేసినట్లు తెలిపారు. ఏఓ భాస్కర్, పంచాయతీ విస్తరణ అధికారి శారదాదేవి, ఏపీఓ చిన్నరెడ్డెమ్మ పాల్గొన్నారు.

తాగునీటికి రోడ్డెక్కి నిరసన



ఖాళీ బిందెలతో బైఠాయించిన మహిళలు

కుప్పం రూరల్: మండలంలోని పైపాళ్యం బీసీ కాలనీ వాసులు తాగునీటి కోసం గురువారం రోడ్డెక్కి నిరసన తెలిపారు. కొంత మంది గ్రామస్తులు బోరు నుంచి వచ్చే పైపులైన్‌కు నేరుగా కనెక్షన్ ఇచ్చుకోవడంతో ఎగువ ప్రాంతాల్లోని వారికి నీరు సరఫరా కావడం లేదని మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించారు. కొత్త బోరు వేసి అందరికీ తాగునీరు సరఫరా చేస్తామని గ్రామపెద్దలు హామీ ఇవ్వడంతో మహిళలు నిరసనను విరమించారు.

సచివాలయం.. మందుబాబులకు నిలయం





మందుబాబులకు అడ్డాగా మారిన చౌడేపల్లె సచివాలయం, ఖాళీ సీసాలతో దర్శనమిస్తున్న భవనం

చౌడేపల్లె: మండల కేంద్రంలోని చెడుగుట్లపల్లె మార్గంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన చౌడేపల్లె–3 సచివాలయం మందుబాబులకు నిలయంగా మారింది. రాత్రి, పగలు తేడా లేకుండా మందుబాబులకు విడిది కేంద్రాన్ని తలపిస్తోంది. మద్యం ఖాళీ సీసాలతో ఆ ప్రాంతం చిందరవందరగా తయారైంది. భవనంపై ఏర్పాటు చేసిన ప్రభుత్వ చిహ్నం, శిలాఫలకాన్ని సైతం ధ్వంసం చేశారు. అధికారులు భవనాన్ని సద్వినియోగం చేసుకొనేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సచివాలయ సేవలపై అవగాహన



సచివాలయ సందర్శనలో విద్యార్థులు

పలమనేరు: వృత్తి విద్యలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులను మున్సిపాలిటీ పరిధిలోని టీఎస్ అగ్రహారం సచివాలయ సందర్శన చేశారు. ఇందులో భాగంగా సచివాలయంలో ప్రజలకందే సేవలపై అక్కడి సిబ్బంది విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఒకేషనల్ విభాగం టీచర్లు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీగంధం చెట్టు నరికివేత



నరికేసిన శ్రీగంధం చెట్టు

పుంగనూరు: స్థానిక ఏరియా ఆస్పత్రిలోని శ్రీగంధం చెట్టును బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నరికివేసి తీసుకెళ్లిపోయారు. గురువారం ఈ విషయాన్ని డాక్టర్లు కనుగొన్నారు. నిత్యం రద్దీగా ఉండే ఆస్పత్రి ఆవరణలో రూ.50 వేలు చేసే శ్రీగంధం చెట్టును మిషన్లతో కట్ చేశారు. చెట్టును దుంగలుగా చేసి, వాహనంలో తీసుకెళ్లడంపై పలువురు మండిపడుతున్నారు. ఈ విషయం ఆస్పత్రి డాక్టర్లు, సిబ్బంది తెలియనట్లు నటించడం సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది. ఈ విషయమై జిల్లా అధికారులు వెంటనే చర్యలు తీసుకుని, శ్రీగంధం చెట్టును నరికివేసిన వారికి గుర్తించి, కేసు నమోదు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బాలికల పాఠశాలలో తనిఖీ



భోజనాన్ని రుచి చూస్తున్న జడ్జి హారీఫా షేక్

కుప్పం: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జూనియర్ సివిల్ జడ్జి హారీఫా షేక్ గురువారం తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యత, రుచిని ఆమె పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనాలు పెడుతున్నారా, రుచి ఏలా ఉంది అనే విషయాలను ఆమె విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో సెక్యూరిటీ అంశాలపై విద్యార్థులతో ప్రస్తావించారు. బాలికలకు పాఠశాలలో మౌలిక వసతులపై ఆరా తీశారు. పాఠశాలలో సమస్యలపై తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని విద్యార్థులకు ఆమె తెలిపారు.

కౌన్సిలర్ శ్యామ్‌కు పితృవియోగం





మృతదేహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యేలు సునీల్‌కుమార్, వెంకటేగౌడ

పలమనేరు: మున్సిపాలిటీకి చెందిన రాధాబంగ్లా వార్డు కౌన్సిలర్ శ్యామ్‌సుందర్‌రాజు తండ్రి షణ్ముగం(67) అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. ఈ విషయం తెలిసి జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ్, పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే డా.సునీల్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శులు బైరెడ్డిపల్లి క్రిష్ణమూర్తి, మండీసుధా, పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు, మున్సిపల్ కౌన్సిలర్లు గురువారం పట్టణంలోని వారి నివాసానికి వెళ్లారు అక్కడ ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు నివాళులర్పించారు.

నేడు మామిడి రైతుల సదస్సు

పుంగనూరు: పట్టణంలోని మండల కార్యాలయ సమావేశ భవనంలో ఎనిమిది మండలాలకు చెందిన మామిడి రైతులకు, సిబ్బందికి శుక్రవారం ఉదయం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఉద్యానవన శాఖ అధికారి వరప్రసాద్ గురువారం తెలిపారు. కార్యక్రమానికి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి, శాస్త్రవేత్తలు, డాక్టర్ కవిత రంజిత్‌కుమారి పాల్గొని రైతులకు పలు సూచనలు, సలహాలు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. 8 మండలాలకు చెందిన రైతులు సదస్సులో పాల్గొని మామిడి పంటలపై అవగాహన పెంచుకోవాలని కోరారు

ఆలయ హుండీలో చోరీ



యాడగురికిలో దుండగులు పగలగొట్టిన హుండీ

వి.కోట: ఆలయ హుండీలే లక్ష్యంగా వరుస చోరీలతో బెంబేలెత్తిస్తున్న వైనం మండలంలో చోటుచేసుకుంది. బుధవారం అర్ధరాత్రి మండలంలోని కృష్ణాపురం పంచాయతీ యాడగురికి గ్రామంలోని గంగమ్మ ఆలయంలో దొంగలు చొరబడి హుండీ తాళాలు పగులగొట్టి రూ.50 వేల నగదు అపహరించుకుని వెళ్లినట్లు గ్రామస్తులు తెలుపుతున్నారు. రాత్రి వేళ గుర్తుతెలియని దుండగులు ఆలయ గేటు తాళాన్ని పగులగొట్టి హుండీ తాళాన్ని కట్టర్లతో కోసి నగదు అపహరించుకున్నారన్నారు. అంతేకాక సోమవారం రాత్రి మండలంలోని వెంకటేపల్లి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం హుండీలో నగదు చోరీ, మంగళవారం రాత్రి మద్రి మాకులపల్లిలోని గంగమ్మ ఆలయ హుండీలో నగదు చోరీ జరిగింది. వరుస చోరీలు జరుగుతుండడంతో మండల ప్రజలు హడలెత్తిపోతున్నారు. ఆలయాలే టార్గెట్ చేయడంతో గ్రామస్తులు బెంబేలెత్తుతున్నారు.

రోడ్లు తవ్వేయ్.. వదిలేయ్!

- కాలువల కోసం ఇష్టానుసారంగా రోడ్ల తవ్వకం
- గుంతలు పూడ్చేందుకు జేబులకు చిల్లు
- భవిష్యత్తులో బ్లాక్ అయితే మళ్లీ ఇదే తంతేనా!
- శాశ్వత పరిష్కారం చూపని పుర అధికారులు



పట్టణంలో మురుగు కాలువ తవ్వడంతో అధ్వానంగా వీధులు

కొండను తవ్వి ఎలుకను పట్టడమంటే ఇదేనేమో! పట్టణంలోని కొన్ని కాలనీల్లో మురుగుతో కాలువలు పేరుకుపోయి మురుగు ముందుకు కదలని పరిస్థితి. దీనికి అధికారులు రోడ్లన్నీ ఛిద్రం చేసి మురుగు ముందుకు కదిలేలా చేశారు. కానీ ఆ చిన్న పని కోసం తవ్విన రోడ్లను అలానే వదిలేసి ఆ భారాన్ని ప్రజలపై మోపడం సరికాదు. తరుచూ జరిగే ఇలాంటి సమస్యకు ముందు చూపుతో శాశ్వత ప్రణాళిక సిద్ధం చేస్తే ప్రజలకు చక్కని పరిష్కారం దొరుకుతుంది.

కుప్పం: మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజ్ కాలువల్లో మురుగు నీరు బ్లాక్ అయిందని వారం రోజులుగా రోడ్లను ఇస్టానుసారంగా తవ్వేశారు. దీంతో రహదారులపై మురుగు, చెత్తా చెదారం చేరి అధ్వానంగా మారాయి. గుంతలను ఆయా దుకాణాదారులు, ఇళ్ల యజమానులే సొంత డబ్బులు వెచ్చించి ఎవరి ఇంటి ముందు వారు పూడ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. భవిష్యత్తులో మళ్లీ కాలువలు బ్లాక్ అయితే ఇలాంటి ఇబ్బందులే పదే పదే పడలేమని పట్టణ ప్రజలు వాపోతున్నారు.

పట్టణాభివృద్ధి ప్రణాళికలపై అసహనం: ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పం పట్టణాభివృద్ధి ప్రణాళికలపై ప్రజల్లో అసహనం వ్యక్తం అవుతోంది. ప్యాలెస్ ఎక్స్‌టెన్షన్‌లో మురుగు నీటి కాలువల్లో మురుగు పేరుకుపోయిందని వారం రోజులుగా జేసీబీలతో సీసీ రోడ్లను సైతం తవ్వేశారు. నివాస గృహాలు, వ్యాపార దుకాణాల ముందు ఇష్టానుసారంగా తవ్వి రోడ్లపై మురుగు, బండరాళ్లు వేయడంతో రహదారులు అధ్వానంగా మారాయి. మున్సిపాలిటీ అధికారులు డ్రైనేజ్ కాలువలను తవ్వి పూడ్చకపోవడంతో వేల రూపాయల ఖర్చు పెట్టి ఎవరి ఇంటి ముందు వారు పూడ్చుకోవాల్సిన అగత్యం ఏర్పడింది.

హామీల ఆచరణేదీ: మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని పాలకులు హామీ ఇచ్చినా ఆచరణలో మాత్రం అమలు చేయడం లేదు. ఆదర్శంగా అభివృద్ధి చేయడమంటే రోడ్లు తవ్వి వదిలేయడమేనానని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కాలువల్లో నిలిచి పోయిన నీటిని క్లియర్ చేయడం కోసం రోడ్లన్నీ తవ్వి అధ్వాన్నంగా చేశారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. వాటికి మరమ్మతులు చేయకుండా ప్రజలపై అదనపు భారం మోపడం ఎంత వరకు సబబని అధికారులపై మండిపడుతున్నారు.

కొరవడిన ముందుచూపు: ఐదేళ్లకు ముందు డ్రైనేజీల్లో మురుగు పేరుకుపోయిందని సీసీ రోడ్లు తవ్వేశారు. మళ్లీ ఇప్పుడు తవ్వేశారు. కాలువల్లో మురుగు బ్లాక్ అయిన ప్రతిసారీ ఇలానే తవ్వుకుంటూ పోతే ఎలా అని ఆరోపిస్తున్నారు. దీనికి అధికారులు ముందు చూపుతో శాశ్వత పరిష్కారం చూపకుండా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా అధికార యంత్రాగం, పాలక పక్షం ముందస్తు చూపుతో వ్యవహరించి సమగ్రమైన ప్రణాళికతో పట్టణాన్ని అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

దుస్తుల దుకాణంలో చోరీ



సీసీ పుటేజీలో నమోదైన చోరీ దృశ్యం

గంగవరం: మండలంలోని నాలుగు రోడ్లు కూడలిలో ఉన్న ఎంఎం ఫ్యాషన్స్ దుస్తుల దుకాణంలో గురువారం తెల్లవారుజామున దుండగులు చోరీ చేశారు. గంగవరానికి చెందిన మాధవి పుంగనూరు రోడ్డులో ఎంఎం ఫ్యాషన్స్ దుస్తుల దుకాణం నిర్వహిస్తున్నారు. బుధవారం రాత్రి దుకాణాన్ని మూసేసి ఇంటికి వెళ్లారు. గురువారం ఉదయం దుకాణం తెరిచి చూడగా చోరీ జరిగినట్టు గుర్తించారు. సీసీ పుటేజీని పరిశీలించగా గురువారం తెల్లవారుజామున సుమారు 2.47 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి ముఖానికి మాస్క్, తలకు టోపీ ధరించి షట్టర్ తాళాలు పగులగొట్టి దుకాణంలోకి ప్రవేశించాడు. రూ.లక్షకు పైగా విలువ చేసే దుస్తులను చోరీ చేశాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు బాధితురాలు మాధవి తెలిపారు. అదేవిధంగా వినాయకచవితి పండుగకు నాలుగు రోజుల ముందు ఇదే షాపులో చోరీ జరిగి రూ.3 లక్షలు విలువైన దుస్తులు, చేతి బ్రాస్‌లెట్‌ను చోరీ చేసినట్టు బాధితురాలు తెలిపారు. మళ్లీ దీపావళి పండుగ ముందు చోరీ జరగడంతో ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు దర్యాప్తు చేసి న్యాయం చేయాలని కోరారు.